సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 26 । మే । 2024



కెమికల్ ఇంజినీరింగ్‌లో విస్తృత అవకాశాలు 8లో



ఉజ్వల భవిష్యత్‌కు కేరాఫ్ ఆర్‌జీయూకేటీ 8లో



కేకే లైన్‌లో డీఆర్‌ఎం తనిఖీలు 8లో

న్యూస్‌రీల్

ఏయూ డిగ్రీ పరీక్ష ఫలితాలు విడుదల



ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు పరీక్షల విభాగం డీన్ ఆచార్య డి.వి.ఆర్.మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాను ఏయూ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. డిగ్రీ ఆరో సెమిస్టర్‌లో మొత్తం 27,603 మంది పరీక్షకు హాజరవగా 27,483 మంది ఉత్తీర్ణత సాధించారు. దీంతో 99.57 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. బి.ఎ(సీబీసీఎస్)లో 99.68, బీబీఏ(సీబీసీఎస్)లో 98.66,బీకాం(కంప్యూటర్స్)లో 99.71, బీకాం (జనరల్)లో 99.92, బీహెచ్‌ఎంసీటీలో 100, బీఎస్సీలో 99.52, బీఎస్సీ ఫుడ్ టెక్నాలజీలో 90, బీఎస్సీ ఫుడ్ సైన్స్‌లో 100, బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీలో 100, బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్‌లో 100 మంది ఉత్తీర్ణత సాధించారు.

గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

కంచరపాలెం: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరంలో ఇంటర్, 5వ తరగతిలో మిగులు సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా సమన్వయాధికారి ఎస్.రూపవతి తెలిపారు. విశాఖ జిల్లా పరిధిలో 3, అనకాపల్లి జిల్లా పరిధిలో 8 గురుకులాల్లో మిగుల సీట్లు భర్తీ చేస్తామన్నారు. 5వ తరగతిలో బాలుర అడ్మిషన్ కోసం 28వ తేదీ కంచరపాలెంలోని జిల్లా సమన్వయాధికారి కార్యాలయంలో, బాలికల అడ్మిషన్ కోసం 29వ తేదీ తాళ్లపాలెం అంబేడ్కర్ గురుకులంలో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. 4వ తరగతి స్టడీ సర్టిఫికెట్, ఆధార్, కుల, ఆదాయ ధ్రువపత్రాలతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఆమె కోరారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో బాలుర అడ్మిషన్ కోసం 30వ తేదీ సబ్బవరం గురుకులంలో, బాలికలకు 31న మేహాద్రి గెడ్డ గురుకులంలో కౌన్సెలింగ్ ఉంటుందని, తగిన ధ్రువీకరణపత్రాలతో హాజరుకావాలని సూచించారు.

జ్ఞాపకాలు పదిలం



స్నేహితుడి టై సరిచేస్తూ..

ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి.. ఇక్కడే కలిశాము.. చదువులమ్మ చెట్టు నీడలో.. అంటూ విదేశీ విద్యార్థులు ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిపాలన భవనం వద్ద శనివారం సందడి చేశారు. ఏయూలో చదువు పూర్తి చేసుకుని.. తమ దేశాలకు వెళ్తున్న సందర్భంగా విదేశీ విద్యార్థులు జీవితకాలం గుర్తుండిపోయేలా జ్ఞాపకాలను పదిలపరచుకున్నారు. డిగ్రీలు తీసుకుని.. కాన్వొకేషన్ డ్రెస్‌లు వేసుకుని.. తమ స్నేహితులతో కలిసి ఫొటోలు తీసుకుంటూ ఉత్సాహంగా గడిపారు.

– ఏయూక్యాంపస్



స్నేహితురాలిని సెల్‌ఫోన్‌లో బంధిస్తూ..



స్నేహితులతో ఒక సెల్ఫీ



పట్టభద్రులైన వేళ..





చారిత్రక భవనం వద్ద..

స్ట్రాంగ్ రూమ్‌ల తనిఖీ



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలోని స్ట్రాంగ్ రూమ్‌లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున శనివారం తనిఖీ చేశారు. రోజువారీ తనిఖీల్లో భాగంగా పోలీసు జాయింట్ కమిషనర్ ఫకీరప్ప, ఏడీసీ కె.ఎస్. విశ్వనాథన్‌లతో కలిసి పార్లమెంట్, అసెంబ్లీ స్ట్రాంగ్ రూమ్‌లను కలెక్టర్ తనిఖీ చేసి.. అక్కడ పరిస్థితులను గమనించారు. భద్రతాపరమైన చర్యలను పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, మానిటరింగ్ రూమ్ ద్వారా పర్యవేక్షణ గురించి అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయా నియోజకవర్గాల ఆర్వోలు, అధికారులు వారి వెంట ఉన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు రెండో రోజు శనివారం ప్రశాంతగా జరిగాయి. ఉదయం జరిగిన ఫస్టియర్ పరీక్షకు 16,180 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా 15,643 మంది హాజరయ్యారు. 97 శాతం హాజరు నమోదైనట్లు ఆర్‌ఐవో పి.మురళీధర్ తెలిపారు. అదే విధంగా మధ్యాహ్నం జరిగిన సెకండియర్ పరీక్షకు 538 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా 464 మంది హాజరయ్యారు. 86 శాతం హాజరు నమోదైనట్లు ఆర్‌ఐవో తెలిపారు. పరీక్షల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఫ్లెయింగ్ స్క్వాడ్ బృందాలు కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించాయి. అదేవిధంగా ఆర్‌ఐవో మురళీధర్, డీవీఈవో రాధ జిల్లాలోని పలు కేంద్రాలను తనిఖీ చేసి, మాస్ కాపీయింగ్ ఆస్కారం లేకుంగా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు.

అడ్డగోలుగా పార్కింగ్ చేస్తే.. అంతే

- రాంగ్ పార్కింగ్ వాహనాలకు తాళాలు
- ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక చర్యలు



రాంగ్ పార్కింగ్‌లో ఉన్న వ్యాన్ టైర్‌కు లాక్ వేస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్



కారుకు లాక్ వేసి.. జరిమానా స్టిక్కర్ అతికిస్తున్న కానిస్టేబుల్




ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలకు సిద్ధమైన ట్రాఫిక్ పోలీసులు

సీతమ్మధార: రహదారి భద్రత దృష్ట్యా నగరంలో నెల రోజుల పాటు ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం ట్రాఫిక్ పోలీసులు ఆశీలమెట్ట వద్ద రాంగ్ పార్కింగ్‌లో ఉన్న వాహనాల చక్రాలకు తాళాలు వేసి జరిమానాలు విధించారు. రాంగ్ పార్కింగ్ వాహనాలకు రూ. 1,035 జరిమానా విధించారు. ఆశీలమెట్ట నుంచి సిరిపురం, వీఐపీ రోడ్డులో ర్యాంగ్ పార్కింగ్ చేసిన కార్లు, వ్యాన్‌లు, ఆటోలకు చలానాలు విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీస్ అధికారులు మాట్లాడుతూ రాంగ్ పార్కింగ్ వాహనాల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ సమస్యకు రాంగ్ పార్కింగ్ ఒక కారణమన్నారు. రాంగ్ పార్కింగ్ సమయంలో చలానాలు విధించిన వాహనాలకు అపరాధ రుసుం చెల్లిస్తేనే ఆయా వాహనాలను వాటి యజమానులకు తిరిగి అప్పగిస్తామని తెలిపారు. ప్రమాదాల నివారణ.. సురక్షితమైన ప్రయాణాల నిమిత్తం నిబంధనలు పక్కాగా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. నగర వ్యాప్తంగా శనివారం సీపీ రవిశంకర్ ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు.

సరకు రవాణాలో సరికొత్త వ్యూహాలు

ఈస్ట్‌కోస్ట్ గేట్ వే ఆఫ్ ఇండియాగా నౌకాయానంలో అంతర్జాతీయంగా ఎదుగుతున్న విశాఖపట్నం పోర్టు అథారిటీ గేరు మార్చింది. సరకు రవాణాలో ఏటికేడూ వృద్ధి నమోదు చేసుకుంటున్న పోర్టు.. దేశంలోని మేజర్ పోర్టులతో పోటీ పడుతోంది. ఎప్పటికప్పుడు సరకు రవాణాలో సరికొత్త వ్యూహాలను అనుసరిస్తోంది. ఇందులో భాగంగానే హ్యాండ్లింగ్ కోసం మోడ్రన్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తోంది. మరోవైపు భారీ నౌకలను సైతం సులువుగా బెర్తింగ్ చేసేలా బెర్తులను ఆధునికీకరిస్తోంది.

– సాక్షి, విశాఖపట్నం



విశాఖపట్నం పోర్టు

వచ్చే మూడేళ్లలో నిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందించడంతో పాటు నంబర్ వన్ పోర్టుగా అభివృద్ధి చెందేందుకు విశాఖపట్నం పోర్టు అథారిటీ అడుగులు వేస్తోంది. సామర్థ్యాన్ని మరింత పెంచుకునేలా మౌలిక వసతుల కల్పనతో పాటు జెట్టీలు, కంటైనర్ టెర్మినల్ విస్తరణ, రవాణా, అనుసంధాన ప్రాజెక్టులపై ప్రధానంగా దృష్టిసారించింది. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులతో పాటు చానళ్లు, బెర్తులను మరింత లోతుగా విస్తరించడం ద్వారా అంతర్గత వనరుల నుంచి ఆదాయం ఆర్జించేలా సరికొత్త మార్గాలను అన్వేషిస్తోంది. వివిధ జెట్టీల ద్వారా మాంగనీస్, బొగ్గు, జిప్సం, బాక్సైట్ తదితర ఖనిజాలు, ఇతర ప్రధాన ఉత్పత్తులు రవాణా జరుగుతుంటుంది. భవిష్యత్‌లో వీటి రవాణా సామర్థ్యం పెరిగే అవకాశం ఉన్నందున జెట్టీ సామర్థ్యాన్ని కూడా పెంచేలా పోర్టు పనులు ప్రారంభించింది. రైల్వేల ద్వారా కార్గో హ్యాండ్లింగ్ వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలకు వీపీఏ ఉపక్రమించింది. పోర్టులోని ఆర్‌అండ్‌డీ యార్డులో వ్యక్తిగత క్యాబిన్‌ల నిర్మాణం, ప్యానెల్ ఇంటర్‌లాకింగ్ ద్వారా యార్డును రైల్వే ప్రమాణాలకు అనుగుణంగా పునరుద్ధరించే పనులు చురుగ్గా సాగుతున్నాయి.

- విశాఖ పోర్టు అథారిటీ వినూత్న ప్రణాళికలు
- సరకు రవాణాలో ఆధునిక సాంకేతికత
- రూ.14.03 కోట్లతో మోడ్రన్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్
- రూ.66.12 కోట్లతో ఈక్యూ–6 బెర్త్ అత్యాధునిక యాంత్రీకరణ
- భారీ నౌకలను సైతం సులువుగా హ్యాండ్లింగ్ చేసేలా నిర్మాణం
- 100 మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు

ఈక్యూ–6 అభివృద్ధికి శ్రీకారం

పోర్టు ఇన్నర్ హార్బర్‌లోని ఈక్యూ–6 బెర్త్ అభివృద్ధి, యాంత్రీకరణ పనులను మెస్సర్స్ ఎవర్ సన్ మెరైన్ ట్రేడ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగించింది. పీపీపీ విధానంలో ఈ పనులను ఆ సంస్థ త్వరలో చేపట్టనుంది. ప్రస్తుతం ఈ క్యూ–6 బెర్త్ పాక్షిక యాంత్రీకరణతో ఉంది. దీని పొడవు 255 మీటర్లు. యాంత్రీకరణలో భాగంగా క్రేన్‌లు, లోడర్స్, ట్రక్స్, పోర్క్ లిఫ్ట్ వంటి పరికరాలు అందుబాటులోకి వస్తాయి. రూ.66.12 కోట్ల విలువైన ఈ ఆధునికీకరణ పనులు పూర్తయితే.. ఏడాదికి 2.62 మిలియన్ మెట్రిక్ సరకును రవాణా చేసే సామర్థ్యానికి పోర్టు చేరుకోనుంది. బెర్త్‌ను ఆధునికీకరించడం ద్వారా 50,000 డీడబ్ల్యూటీ సామర్థ్యం, 200 మీటర్ల పొడవు 32 మీటర్ల బీమ్, 11.50 మీటర్ల డ్రాఫ్ట్ కలిగిన నౌకలను కూడా హ్యాండిల్ చేసే అవకాశం కలుగుతుంది. 15 నెలల్లో ఈ పనులు పూర్తి చేసేందుకు లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ బెర్త్‌ను అభివృద్ధి చేయడం ద్వారా 100 మందికి నేరుగా, మరికొంత మందికి పరోక్షంగా ఉపాధి లభించనుంది.


మోడ్రన్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్

మరోవైపు సరకు హ్యాండ్లింగ్ చురుగ్గా నిర్వహించేందుకు అత్యాధునిక పద్ధతులను అనుసరిస్తోంది. ఇందులో భాగంగా జాతీయ సాంకేతిక కేంద్రం(ఎన్‌టీసీపీడబ్ల్యూసీ) వెసెల్ మేనేజ్‌మెంట్ సిస్టంతో రూ.14.03 కోట్లతో పరస్పర అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. సరకు రవాణాలో వెసెల్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అనేది అత్యంత కీలకమైన అంశం. పోర్టుల్లో ట్రాఫిక్ నియంత్రణకు ఈ వ్యవస్థ అత్యంత కీలకమైనది. కార్గోని వీలైనంత త్వరగా ఎగుమతి దిగుమతులు చేసేందుకు ఈ మోడ్రన్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ఉపయుక్తంగా నిలుస్తుంది.

జెన్ పార్కు.. ఆనందాల మార్కు



పార్కులో కొలను



ప్రశాంత వాతావరణంలో పార్కు



కుందేళ్ల సమూహం



విద్యుత్ కాంతుల మధ్య బుద్ధుడి విగ్రహం

నగరం మధ్యలో ఓ చిట్టడవి.. అందులో జలపాతాన్ని తలపించేలా చిన్న చిన్న ప్రవాహాలు.. వాటి మధ్యలో బుద్ధుడి విగ్రహం.. చుట్టూ కుందేళ్ల సమూహం.. జింకల సంచారం.. ఇలాంటి సన్నివేశాలు చూడాలంటే జీవీఎంసీ సృష్టించిన జెన్ పార్కుకు వెళ్లాల్సిందే. సంపత్ వినాయక ఆలయం రోడ్డులో జీవీఎంసీ కమిషనర్ బంగ్లాకు అనుకుని ఈ పార్కు మనకు దర్శనమిస్తుంది. ఈ పార్క్‌లో ప్రవాహ శబ్దం నిజంగా మనం అడవిలో ఉన్నామా అనేలా మంత్రముగ్ధులను చేస్తుంది. కుందేళ్లు, జింకల నమూనాలు, వెదురుతో ఏర్పాటు చేసిన వంతెన సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ప్రశాంతతకు నిదర్శనంగా బుద్ధుడి విగ్రహం కూడా ఇక్కడ ఏర్పాటు చేశారు. ఈ పార్కు నిత్యం సందర్శకులతో సందడిగా ఉంటోంది. ఫొటోలు తీసుకుంటూ పెద్ద వారు.. ఇక్కడున్న కుందేళ్లు, దుప్పి బొమ్మల వద్ద చిన్నారులు సరదాగా ఆటలాడుతూ ఎంజాయ్ చేస్తున్నారు.



- సీతమ్మధార

ఉజ్వల భవిష్యత్‌కు కేరాఫ్ ఆర్‌జీయూకేటీ

- అందుబాటులో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య
- గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు మంచి అవకాశం
- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రవేశాల్లో నాలుగు శాతం డిప్రెవేషన్ స్కోర్
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం
- జూన్ 25 ఆఖరు తేదీ

సాక్షి, విశాఖపట్నం: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్‌జీయూకేటీ)లు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యకు చిరునామాగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత పేద విద్యార్థుల ఉన్నత విద్య కలను సాకారం చేస్తూ వారు అత్యున్నత స్థానాల్లో కొలువులు సాధించేందుకు ఆసరాగా ఉంటున్నాయి. 10వ తరగతి మార్కుల ఆధారంగా ఇందులో ప్రవేశాలు లభిస్తాయి. రాష్ట్రంలో నాలుగు క్యాంపస్‌లు శ్రీకాకుళం, ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలులో ప్రవేశాలకు ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలైంది. ఒక్కో క్యాంపస్‌లో 1100 సీట్లు (ఎకనామికల్లీ బ్యాక్ వర్డ్ క్లాసెస్ రిజర్వేషన్ కలిపి) అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు నాలుగు శాతం డిప్రెవేషన్ స్కోర్ ఇస్తారు. 10వ తరగతి మార్కులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, స్కౌట్, ఆంగ్లో ఇండియన్, దివ్యాంగులు వంటి ప్రత్యేక కోటాలు ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

అత్యుత్తమ విద్య : ఆర్‌జీయూకేటీలో ఆరేళ్లు చదువుకునే అవకాశం లభిస్తుంది. రెండేళ్ల ప్రీ యూనివర్సిటీ కోర్సు, నాలుగేళ్ల ఇంజినీరింగ్ కోర్సు చదువుకోవచ్చు. లేదంటే పీయూసీ పూర్తి చేసి రిలీవ్ కావచ్చు. పీయూసీ అనంతరం ఇంజినీరింగ్‌లో కొనసాగవచ్చు. సీఎస్ఈ, ఈసీఈ, సివిల్, మెకానికల్, ట్రిపుల్ఈ, ఐటీ వంటి బ్రాంచ్‌తో పాటు ఇడుపులపాయ, నూజివీడుల్లో ప్రత్యేక బ్రాంచ్‌లు నిర్వహిస్తున్నారు. ఆర్‌జీయూకేటీలో ఇంజినీరింగ్ పూర్తిచేసిన విద్యార్థులు ఉన్నత విద్యకు సంబంధించిన గేట్ వంటి ర్యాంకులు సాధిస్తున్నారు. కొందరు విద్యార్థులు ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీస్ వంటి అత్యున్నత ఉద్యోగాలకు ఎంపికవుతున్నారు. పరిశ్రమల్లో మంచి ప్యాకేజీలకు సైతం సాధిస్తున్నారు.

జూలై 11న జాబితా..

ప్రస్తుతం ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. ఈ నెల 6న నోటిఫికేషన్ విడుదల కాగా, 8వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. జూన్ 25 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. జూలై 11న ఎంపికైన వారి జాబితా విడుదల చేస్తారు. జూలైలో ప్రవేశాలు పూర్తిచేసి, ఆగస్టు మొదటి వారం నుంచి తరగతులు ప్రారంభిస్తారు.

రెసిడెన్షియల్ విధానంలో బోధన

ఏడాదికి పీయూసీ ఫీజు స్ట్రక్చర్ రూ.45 వేలు కాగా, ఇంజినీరింగ్ విద్యార్థులకు రూ.50 వేలు, ఇతర రాష్ట్రాల విద్యార్థులకు రూ.1.50 లక్షలుగా నిర్ణయించారు. అర్హులైన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు లభిస్తాయి. తెలుపు రేషన్ కార్డు ఉన్న కుటుంబాల పిల్లలకు ఉచితంగా విద్య లభిస్తుంది. పూర్తిగా రెసిడెన్సియల్ విధానంలో బోధన జరుగుతుంది.

కెమికల్ ఇంజినీరింగ్‌లో విస్తృత అవకాశాలు

మురళీనగర్ : కెమికల్ ఇంజినీరింగ్‌లో విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని అనకాపల్లి జిల్లా కో-ఆపరేటివ్ ఆఫీసర్, డిప్యూటీ రిజిస్ట్రార్ ఎ.పి. స్వరూపారాణి అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్)లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన శనివారం జాబ్ అచీవర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఒక విద్యా సంవత్సరంలో గైస్ నుంచి వంద మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ హెచ్ఆర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రెడ్డిపల్లి శ్రీనివాస్, ఆంధ్రా పెట్రోకెమికల్ లిమిటెడ్ సీనియర్ మేనేజర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ కంపెనీల తరపున విద్యార్థుల ఇండస్ట్రియల్ శిక్షణకు అవసరమైన సహకారం అందిస్తామన్నారు. ప్రిన్సిపాల్ వెంకటరమణ మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరంలో తమ కాలేజీ నుంచి వంద మందికి ఉద్యోగాలు వచ్చాయని చెప్పారు. అత్యధికంగా రూ.4 లక్షల వార్షిక ప్యాకేజీతో నలుగురు విద్యార్థులు ఉద్యోగాలు సాధించగా ఆంధ్రా పెట్రో కెమికల్స్‌లో 26 మంది రూ.3.6 లక్షలు, ఐటీసీ భద్రాచలంలో ఆరుగురు రూ.3.82 లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు పొందారన్నారు.

ఈ సందర్భంగా ఇటీవల ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు నియామక ఉత్తర్వులను డిప్యూటీ రిజిస్ట్రార్ స్వరూపారాణి చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ రిటైర్డ్ పీఆర్‌వో శర్మ, గైస్ పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.దేముడు, బెల్ రిటైర్డ్ సేఫ్టీ ఆఫీసర్ ఎ.వరహాలు, కాలేజీ హెచ్‌వోడీలు డాక్టర్ బీవీ లక్ష్మణరావు, సీహెచ్ జయప్రకాష్‌రెడ్డి, డి.దామోదర్, ఎస్.ప్రశాంత కుమారి పాల్గొన్నారు.

బాలికపై కేజీహెచ్ ఉద్యోగి లైంగిక వేధింపులు

డాబాగార్డెన్స్: దళిత బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేజీహెచ్ ఉద్యోగి దిలీప్‌పై వన్‌టౌన్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. పోక్సో కేసు విషయమై వైద్య పరీక్షల కోసం ఆరిలోవ పోలీస్‌స్టేషన్ నుంచి కేజీహెచ్ గైనిక్ వార్డుకు వచ్చిన బాలిక పట్ల అక్కడ పనిచేస్తున్న దిలీప్ అనుచితంగా ప్రవర్తించాడు. సభ్య సమాజం తలదించుకునేలా వ్యవహరించాడు. ఈ విషయమై ఆ బాలిక తన తల్లిదండ్రుల వద్ద మొరపెట్టుకుంది. వారు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఆరిలోవ స్టేషన్‌లో ఇప్పటికే కేసు నమోదు అవ్వడంతో జీరో ఎఫ్ఐఆర్ ఫైల్ చేసి.. వన్‌టౌన్ పోలీసులకు బదిలీ చేశారు. వన్‌టౌన్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి.. దిలీప్‌ను రిమాండ్‌కు తరలించారు.

జంతు సంరక్షణ చట్టం నోడల్ అధికారిగా ఏసీపీ శ్యామలరావు

విశాఖ సిటీ: విశాఖలో జంతువులపై నేరాలు, జంతు సంరక్షణ చట్టాల అమలుకు నోడల్ అధికారిగా జోన్-2 ఏసీపీ(క్రైమ్) సిహెచ్.శ్యామలరావు నియమితులయ్యారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఈ నియామకానికి సంబంధించి ఉత్తర్వులు ఇచ్చారు. దీనిలో భాగంగా ఏసీపీ శ్యామలరావు కమిషనరేట్ పరిధిలో ఏసీపీలు, ఎస్‌హెచ్‌ఓలతో సమన్వయం చేసుకుంటూ, జంతు సంరక్షణ చట్టాలు సమర్థవంతంగా అమలయ్యేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. నగరంలో జంతు అక్రమ రవాణా, జంతు వధ నియంత్రణతో పాటు జంతు చట్టాలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. పండగల సీజన్లలో జంతువులను వధించడానికి రాష్ట్ర హైకోర్టు మార్గదర్శకాలతో స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆదేశాలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఐటీఐలో స్టీల్‌ప్లాంట్ ఆర్ కార్డు అభ్యర్థులకు సీట్లు

మద్దిలపాలెం : స్టీల్‌ప్లాంట్ ఆర్ కార్డులున్న అభ్యర్థులకు ప్రభుత్వ ఐటీఐలో సీట్లు కేటాయిస్తున్నామని, ఆసక్తి గల వారు దరఖాస్తులు చేసుకోవాలని జూనియర్ ఎంప్లాయిమెంట్ అధికారి సీహెచ్ కుమారస్వామి కోరారు. జూన్ 10వ తేదీలోగా ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

డిప్యూటీ డీఈవో పరీక్షకు 60.57 శాతం హాజరు

మహారాణిపేట : ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో డిప్యూటీ డీఈవో పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో 14 కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 4,497 మందికి గాను 2,724 మంది హాజరయ్యారు. 1,773 మంది గైర్హాజరయ్యారు. తొలి రోజు 60.57 శాతం హాజరు నమోదైనట్లు అధికారులు తెలిపారు.

బ్రేక్ బదులు యాక్సిలరేటర్ తొక్కి..

- అదుపుతప్పి ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు
- బాలునికి గాయాలు
- కారు నడిపిన యువకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



బోల్తాకొట్టిన కారు

అగనంపూడి: బ్రేక్ బదులు యాక్సిలరేటర్ తొక్కిన సంఘటనలో ఒక బాలుడికి కాలు విరిగింది. దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధి రాజీవ్‌నగర్ ఫేజ్-2 (మాతృశ్రీనగర్) ప్రధాన రహదారిలో చోటు చేసుకున్న సంఘటనకు సంబంధించి దువ్వాడ సీఐ వావిలపల్లి ఎర్రంనాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మాతృశ్రీనగర్‌కు చెందిన ఉక్కు విశ్రాంత ఉద్యోగి బళ్ల వందన్‌రాజు శనివారం ఉదయం తన కారు హ్యాండ్ బ్రేక్ వేయడం మరిచిపోయాడు. తన కుమారుడు బళ్ల భాను ప్రకాష్ (18)కు హ్యాండ్ బ్రేక్ వేయమని తాళాలిచ్చాడు. దీంతో భాను అత్యుత్సాహానికి పోయి కారు డ్రైవ్ చేశాడు. గ్లోరియా పాఠశాల ఎదురుగా రహదారిలో స్పీడ్ బ్రేకర్ ఉన్న విషయాన్ని గమనించని భానుప్రకాష్..కారు కుదుపునకు బ్రేక్ వేయబోయి యాక్సిలరేటర్ తొక్కాడు. దీంతో ఎదురుగా ద్విచక్రవాహనంపై వస్తున్న సిద్ధాబత్తుల జగన్మోహన్ రావు, తన కుమారుడు కుశ్వంత్‌ను కారు ఢీకొట్టింది. తరువాత ఆగకుండా వెళ్లి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొట్టి బోల్తా పడింది. ఈసంఘటనలో ద్విచక్రవాహనం వెనుక కూర్చున్న కుశ్వంత్ కాలు విరిగిపోయింది. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో ఆ సమయంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. భానుప్రకాష్‌ను అదుపులోకి తీసుకున్నారు. కారు నడిపిన యువకుడికి డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం, మితిమీరిన వేగంతో కారు నడపడం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు నిర్ధారించారు. గాయాలపాలైన బాలుడిని ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్పించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేకే లైన్‌లో డీఆర్ఎం తనిఖీలు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ శనివారం కేకే లైన్ పరిధి శివలింగపురంలో తనిఖీలు నిర్వహించారు. ఈ స్టేషన్‌లో జరుగుతున్న భద్రతా పనులను పరిశీలించారు. సిగ్నలింగ్, ట్రాక్‌ల పెంపు, పాయింట్స్, క్రాస్ ఓవర్స్, ఓవర్ హెడ్ ఎలక్ట్రిఫికేషన్ వంటి పనులను పరిశీలించారు. ఈ ప్రాంతంలో నిత్యం జరిగే ఇనుప ఖనిజ రవాణాను దృష్టిలో ఉంచుకుని, భద్రతకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలని డీఆర్ఎం సూచించారు. ఆయన వెంట ఏడీఆర్ఎం (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)సుధీర్‌కుమార్ గుప్తా, సీనియర్ డివిజనల్ ఇంజినీర్ విజేంద్ర కుమార్, సీనియర్ డివిజనల్ సిగ్నల్ అండ్ టెలికం ఇంజినీర్ దీప్తాన్షు శర్మ, సీనియర్ డివిజన్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ (ట్రాక్షన్) పండిటాం, సీనియర్ డివిజన్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ ఆపరేషన్స్ ఎస్.పర్వతం తదితరులు ఉన్నారు.